TGTEL/25/A1907


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 126 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ ఆదివారం.30.11.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## ముగిసిన తొలివిడత నామినేషన్లు




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: పంచాయతీ ఎన్నికలు మొదటి దశకు సంబంధించి నామినేషన్ల గడువు శనివారం సాయంత్రం ముగిసింది. మొదటి విడతలో 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డుల్లో నామినేషన్లు స్వీకరించారు. ఆదివారం నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయిన నామినేషన్ల వివరాలు వెల్లడించనున్నారు. సోమవారం అప్పీళ్ల స్వీకరణ, డిసెంబరు 2న అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. డిసెంబరు 3న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు వెల్లడిస్తారు. 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఉపసర్పంచి ఎన్నిక ఉంటుందని అధికారులు తెలిపారు. రేపటి నుంచి డిసెంబరు 2 వరకు రెండో విడత ఎన్నికల నామినేషన్లు స్వీకరించనున్నారు. రెండో విడతలో 193 మండలాల్లోని 4,333 పంచాయతీలు, 38,350 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నాయి.

## బీఆర్ఎస్ పాలనలో రూ.1500 కోట్ల అభయహస్తం నిధులు గోల్‌మాల్: మంత్రి సీతక్క


హైదరాబాద్: అమృత్ తెలంగాణ: గత బీఆర్ఎస్ పాలనలో ఆడబిడ్డల పొదుపు అయిన రూ.1500 కోట్ల అభయహస్తం నిధులను, రూ.3 వేల కోట్ల వడ్డీలను కూడా బీఆర్ఎస్ పాలకులు దోచుకున్నారని మంత్రి సీతక్క ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్లు 4.5 లక్షలు మంజూరు చేయడం, 74 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం, లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు జారీ చేయడం, నాణ్యమైన ఇందిరమ్మ చీరలు పంపిణీ, ఏకకాలంలో రెండు లక్షల పంట రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ, సన్న వరిబియ్యం బోనస్ వంటి ఎన్నో కార్యక్రమాలు తమ ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం స్థానిక ఎన్నికలను రెండేళు వాయిదా వేయాల్సి వచ్చిందని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 వేల కోట్లు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. 2026 మార్చి 31 నాటికి ఆర్థిక సంఘం గడువు ముగియనున్న నేపథ్యంలో ఇప్పటికైనా ఎన్నికలు జరపకపోతే రాష్ట్రానికి నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ పెంపునకు అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయని, కానీ బీజేపీ-, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. కులగణనలో బీఆర్ఎస్ పెద్దలు పాల్గొనకపోవడమే దీనికి నిదర్శనమని చెప్పారు. రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పే బీజేపీ నాయకులు, బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం దొంగ దీక్షలు చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రిజర్వేషన్



పెంపు అనేది ఢిల్లీలో పెండింగ్‌లో ఉన్న అంశమని అన్నారు. నిజంగా ప్రధాని మోడీ బీసీ అయితే వెంటనే నిర్ణయం తీసుకోవాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల పెంపుపై కేంద్రం ఆలస్యం చేస్తున్నందున, పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లను కేటాయిస్తామని మంత్రి ప్రకటించారు.

## ఇక బస్సుల్లో కూడా బాత్‌రూంలు

హైదరాబాద్: అమృత్ తెలంగాణ: దూర ప్రయాణాలకు వెళ్లాలంటే సామాన్యుల మొదటి చాయిస్ రైలే. ఎందుకంటే రైలులోనైతే మరుగుదొడ్లు అందుబాటులో ఉంటాయి. బస్సు ప్రయాణంలో అయితే కనీసం మూత్రవిసర్జనకు వెళ్లాలన్నా డ్రైవరు దగ్గరికి వెళ్లి బస్సు ఆపమని అడగడానికి ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటి వారి కోసం ప్రయివేట్ ట్రావెల్స్ సంస్థ అయిన ఇంటర్‌సిటీ తమ బస్సుల్లో బాత్‌రూం సదుపాయం కల్పించింది. డ్రైవర్ సీటు



వెనుకభాగంలో వెస్టర్న్ కమోడ్, ముఖం కడుక్కోవడానికి వాష్‌బేసిన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతానికి మూత్రవిసర్జనకు మాత్రమే అనుమతిస్తున్నారు.

## కెసిఆర్ తెలంగాణ సాధించకుంటే.. కాంగ్రెసోళ్లకు పదవులెక్కడివి?:హరీశ్‌రావు



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: కెసిఆర్ తెలంగాణ సాధించకుంటే.. కాంగ్రెసోళ్లకు పదవులెక్కడివి? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎంఎల్ఎ తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. పార్టీ శనివారం చేపట్టిన దీక్ష దివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెసిఆర్ లేకుంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం లేదన్నారు.

కెసిఆర్ సాధించిన తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ వాళ్లు పెద్ద పెద్ద పదవులు అనుభవిస్తున్నారని అన్నారు. నవంబర్ 29 తోనే డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన వచ్చిందన్నారు. కెసిఆర్ ఆమరణ దీక్ష చేపట్టిన సమయంలో ఆయన ఆరోగ్యానికి హాని ఉందని డాక్టర్లు చెప్పినప్పటికీ కెసిఆర్ దీక్ష విరమించలేదన్నారు. తన ప్రాణాన్ని సైతం లెక్కించకుండా కెసిఆర్ తెలంగాణ సాధిస్తే కొంతమంది సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉద్యమాన్ని చూసి భయపడి కాంగ్రెస్ తెలంగాణను ఇచ్చిందన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగానిగా మార్చిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందన్నారు.


## ఇందిరమ్మ చీరల పంపిణీకి తాత్కాలిక బ్రేక్

హైదరాబాద్: అమృత్ తెలంగాణ: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ జరుగుతున్న ఇందిరమ్మ చీరల పంపిణీకి తాత్కాలికంగా బ్రేక్ పడింది. పంచాయతీ ఎన్నికల కోడ్ కారణంగా చీరల పంపిణీని నిలిపి వేస్తున్నామని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పంపిణీ పునః ప్రారంభం అవుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ శనివారం స్పష్టం చేసింది. కాగా ఇప్పటి వరకు ఇందిరమ్మ చీరల పంపిణీ దిగ్విజయంగా జరిగిందని తెలిపింది. ఈ నెల 19 నుంచి 25 వరకు కేవలం వారం రోజుల్లోనే 43,32,828 ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసినట్లు వెల్లడించింది. సెర్ప్‌లో 46 లక్షల 22 వేల 98 మంది మహిళా సభ్యులకు ఈ చీరల పంపిణీ పూర్తి చేసి కోటి మందికి చీరల పంపిణీ చేయాలన్న లక్షంలో 77.89 శాతం మంది సభ్యులకు చీరల పంపిణీ పూర్తి చేసినట్లు స్పష్టం చేసింది. ఇదిలావుండగా స్వయం సహాయక సంఘాలు (ఎస్ హెచ్ జి)లో సభ్యులు కానీ మహిళలకు కూడా చీరల పంపిణీ నిర్వహించినట్లు తెలిపారు. వారికి వెంటనే సభ్యత్వం ఇచ్చి, మహిళలకు చీరలు అందజేసినట్లు స్పష్టం చేసింది. సుమారు రెండు లక్షల వరకు మహిళలకు ఎస్ హెచ్ జి నూతన సభ్యత్వం ఇచ్చి చీరలను అధికారులు పంపిణీ చేశారని పిఆర్ శాఖ వెల్లడించింది. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకి సభ్యత్వం కల్పించి చీరలు పంచుతున్నారని వివరించింది. ప్రస్తుతం గోదాముల్లో ఇంకా 16 లక్షల చీరలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. దీంతో పాటు



సిరిసిల్ల నేతన్నలు తయారు చేసిన ఇందిరమ్మ చీరలను తయారైన వెంటనే జిల్లా కేంద్రాలకు అధికారులు పంపిస్తున్నారు. కోటి మంది మహిళలకు సభ్యత్వం ఇచ్చి, ప్రణాళికాబద్ధంగా కోటి చీరల పంపిణీని చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పిఆర్ శాఖ పేర్కొంది.

## 'ఐబొమ్మ' అసలు గుట్టు బయటపెట్టిన రవి




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: సినిమాల పైరసీ కేసులో 'ఐబొమ్మ' నిర్వహకుడు ఇమండి రవి రెండో విడత కస్టడీ పూర్తయింది. ఈ విచారణలో ఐ బొమ్మ పూర్తి పేరు 'ఇంటర్నెంట్ బోమ్మ' అని నిందితుడు వెల్లడించాడు. విశాఖలో సినిమాను బొమ్మగా పిలిచేవాళ్లమని చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం అని పేరు పెట్టాలని అనుకున్నట్లు తెలిపాడు. డొమైన్‌లో సాంకేతిక సమస్యతో 'ఎల్' అక్షరం తీసి 'బప్పం' మార్చినట్లు వెల్లడించాడు. విచారణలో భాగంగా పోలీసులు అతడిని 3 రోజుల పాటు ప్రశ్నించి.. కీలక సమాచారం సేకరించారు. పైరసీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ గురించి పోలీసులకు రవి వివరించాడు.

తాను అప్‌లోడ్ చేసిన సినిమాల్నీ టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవేనని చెప్పాడు. అనంతరం నిందితుడిని పోలీసులు కోర్టులో హాజరుపరిచారు

## కొండమల్లేపల్లి సర్పంచి ఏకగ్రీవం

కొండమల్లేపల్లి: అమృత్ తెలంగాణ: నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి పరిధిలోని చిన్న అడిశర్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచిగా వెంకటయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామాభివృద్ధి కోసం రూ.51.30 లక్షలు సొంత నిధులు సమకూరుస్తానని ఆయన గ్రామస్థుల ఎదుట అంగీకరించినట్టు తెలుస్తోంది. ఆ మొత్తాన్ని గ్రామంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి వినియోగించాలని గ్రామపెద్దలు తీర్మానించినట్టుగా సమాచారం. నిజానికి ఇది మూడో విడతలో ఎన్నికలు జరగాల్సిన గ్రామం అయిన్పటికీ ముందే ఏకగ్రీవం చేసుకున్నారు. ఎలాంటి




గొడవలు లేకుండా సర్పంచిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు

అమృత్ తెలంగాణ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు రేపటి నుంచి (సోమవారం) నుంచి ఆరంభమవుతాయి. ఈ సెషన్‌లో ప్రత్యేకించి ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాలు తమ దాడిని తీవ్రతరం చేసే అవకాశం ఉంది. ఓటర్ల జాబితాల సవరణ (సర్)ను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ ఇతర విపక్షాలు తమ విమర్శనాస్త్రాలను ఉభయ సభలలో విన్పించేందుకు రంగం సిద్ధం చేసుకున్నాయి. సమావేశాల నేపథ్యంలో ఆదివారం (నేడు) ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. ఉదయం 11 గంటలకు ఈ భేటీ తరువాత సభా వ్యవహారాల మండలి (బిఎసి) సమావేశాలు ఉంటాయి. వింటర్ సెషన్‌కు తమ వ్యూహాలను ఖరారు చేసుకునేందుకు ఇండియా కూటమి తరఫున పలు పార్టీల ఫ్లోర్ లీడర్స్‌తో సోమవారం ఉదయం రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే కార్యాలయంలో జరుగుతుంది. సభలు సజావుగా సాగేందుకు అన్ని పక్షాల సహకారం కోసం ప్రభుత్వం అభ్యర్థిస్తుంది. బీహార్ ఎన్నికల తరువాత తొలిసారిగా జరిగే పార్లమెంట్ సమావేశాలు కానుండటంతో బిజెపికి ఎన్‌డిఎకు ఇవి ప్రాధాన్యతాంశపు సమావేశాలు అయ్యాయి. డిసెంబర్ 19వ తేదీ వరకూ సమావేశాలు జరుగుతాయి. సర్ ప్రక్రియ దశల్లో పలువురు బూత్ స్థాయి అధికారుల



మరణాలు , ఓట్ల చోరీ అంశాలు ప్రధానంగా ప్రస్తావించేందుకు కాంగ్రెస్ సిద్ధం అయింది. సర్ ఒత్తిళ్లతో కింది స్థాయి ఉద్యోగులు మానసిక వేధింపులకు గురై, గుండెపోట్లతో చనిపోతున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఓటర్ల జాబితాల సవరణ సాధారణ విషయం, ఎన్నికలకు ముందు జరిగే విస్తృత ప్రక్రియ అని, ఏ దశలో ఎటువంటి చర్యలు ఉంటాయి? నిజమైన ఓటర్ల పరిరక్షణ, నకిలీ ఓట్ల తొలిగింపు వంటివి ప్రభుత్వం ప్రస్తావిస్తుంది. ఈసారి సెషన్‌లో పది కీలక బిల్లులను తీసుకురావడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో అణు ఇంధన రంగంలో మార్పులు, ఉన్నత విద్య, కార్పోరేట్ లా, సెక్యూరిటీస్ మార్కెట్ బిల్లు వంటివి సభల్లో ప్రవేశపెడుతారు.

# ప్రతి ఒక్కరు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ప్రతి ఒక్కరు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. శనివారం సంజయ్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల రిజర్వ్ పోలీస్ లైన్ లో పౌర హక్కుల రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగు డా.బి.ఆర్ అంబెడ్కర్ చిత్రపటానికి అదనపు కలెక్టర్, అధికారులు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు రాజ్యాంగం గురించి అవగాహన కలిగి ఉండాలని, ఈ నెల 26 న ఘనంగా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకున్నామని అన్నారు. అన్ని వర్గాల వారికీ రాజ్యాంగం ద్వారానే హక్కు రావడం జరిగిందన్నారు. చదువుతో గౌరవం లభిస్తుందని, ప్రతి ఒక్కరు మంచిగా చదువుకోవాలని అన్నారు. విద్యార్థి దశనుండే మంచి అలవాట్లు అరవర్చుకోవాలని, ఆడపిల్లలకు పరిమితులు విధించకుండా తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని అన్నారు. సమాజంలో మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడి చెడిపోతున్నారని, జిల్లా యంత్రాంగం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని అన్నారు. అందరు చట్టాన్ని గౌరవించాలని, సేవాభావం కలిగి ఉండాలని, మనం చేసిన మంచి పనులతో సమాజంలో చిరస్థాయిగా నిలవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ విద్యార్థులకు విదేశీ విద్య నిధి క్రింద ప్రభుత్వం 20 లక్షల రూపాయలు అందించడం జరుగుతున్నదని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు ఈ కార్యక్రమాలో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి సునీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సామజిక కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో పంచాయతీ ఎన్నికల తొలి దశ నామినేషన్ల దాఖలు గడువు ఇవాళితో ముగియనున్న నేపథ్యంలో, స్థానిక ప్రజలు తక్షణమే నామినేషన్లు దాఖలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి జిల్లాలో పంచాయతీ ఎన్నికల తొలి దశ నామినేషన్ల దాఖలు గడువు ఇవాళితో ముగియనున్న నేపథ్యంలో, స్థానిక ప్రజలు తక్షణమే నామినేషన్లు దాఖలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు ఇవాళే చివరి రోజు కావడంతో, ప్రతి గ్రామంలో మైక్ అనౌన్స్‌మెంట్లు నిర్వహించి ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా నామినేషన్ కేంద్రాల్లో అవసరమైన సహాయక సదుపాయాలు, మార్గదర్శక పత్రాలు, సమాచార బోర్డులు అందుబాటులో ఉంచాలని సూచించారు. సందేహాల నివృత్తి కోసం హెల్ప్‌డెస్కులను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం అవుతూ, చివరి నిమిషం వరకు ఆలస్యం చేయకుండా వెంటనే నామినేషన్ దాఖలు చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎన్నికల నిర్వహణను సమర్థవంతంగా, పారదర్శకంగా కొనసాగించేందుకు అన్ని సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# న్యాయ, పోలీస్, ఆబ్కారీ, జైలు శాఖల అధికారులు సమిష్టి కృషితో బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే. ప్రభాకర్ రావు అన్నారు.

శనివారం జిల్లా కోర్టు కాంప్లెక్స్ లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి ఆయన న్యాయ అధికారుల సదస్సు నిర్వహించారు.







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి న్యాయ, పోలీస్, ఆబ్కారీ, జైలు శాఖల అధికారులు సమిష్టి కృషితో బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే. ప్రభాకర్ రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు కాంప్లెక్స్ లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి ఆయన న్యాయ అధికారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, అధికారులు సమిష్టి కృషితో బాధితులకు సత్వర న్యాయం అందించాలని అన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలికంగా పెండింగ్ కేసులను, ఫోక్సో, గంజాయి వంటి కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. జిల్లా కోర్టులోని వివిధ విభాగాల్లో అక్టోబర్ మాసాంతానికి 7310 కేసులు పెండింగ్ లో ఉన్నాయని, 98 కేసులు దీర్ఘాకాలికంగా పెండింగ్ ఉన్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 18 భూ సేకరణ కేసుల 66 లక్షల రూపాయలకు సంబంధించిన వివరాలను సీసీఎల్ఏ నుండి ఇరిగేషన్, ఆర్థిక శాఖకు పంపించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఏజెన్సీ ఏరియాలో సివిల్ సూట్స్ కేసులను శనివారం విచారణ జరపడం జరుగుతుందని, పాత ఏజెన్సీ కేసులను ఆర్డీవో, సబ్ కలెక్టర్ పరిధిలో విచారణకు పంపడం జరుగుతుందని, ఇది ఒక ఆదిలాబాద్ జిల్లాకి పరిమితం ఉందన్నారు. జైలు, ఆబ్కారీ, డ్రగ్ లకు సంబంధించి లోక్ అదాలత్ పెండింగ్ కెసులను పర్యవేక్షిస్తూ, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం జల్ సంచాయి జన్ బాగిదరి విభాగంలో రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకున్నందుకుగాను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు, ఎస్పీ, అధికారులు కలెక్టర్ ను సన్మానించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు వివేక్ కుమార్, లక్ష్మి కుమారి, సి ఏం రాజ్యలక్ష్మి, డి.హుస్సేన్, మౌనిక, పోలీస్, జైలు, అబ్కారీ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో: సోమవారం ప్రజావాణి రద్దు జిల్లా కలెక్టర్ రాజర్షి షా



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉన్న నేపథ్యంలో, వచ్చే సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంత వరకు ప్రజావాణి కార్యక్రమం చేపట్టబడదని, కోడ్ ముగిసిన వెంటనే ప్రజావాణిని తిరిగి యథావిధిగా పునఃప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

# రేపటి నామినేషన్ ప్రక్రియకు ఈరోజు నుండే టాంటాం నిర్వహించి విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి అధికారులు ఆదేశించారు.





అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి రేపటి నామినేషన్ ప్రక్రియకు ఈరోజు నుండే టాంటాం నిర్వహించి విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి అధికారులు ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సంబంధిత అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రేపటి నుండి రెండో విడత పంచాయితీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో రిటర్నింగ్ అధికారులు ఫారం నంబర్ -1 నుండి 10 వరకు ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రేపటి నామినేషన్ ప్రక్రియకు ఈ రోజు నుండే గ్రామాల్లో టాంటాం తో విస్తృత ప్రచారం నిర్వహించి, ప్రజల నుండి ఎక్కువ నామినేషన్లు వచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. చివరి రోజు ఎక్కువ నామినేషన్లు దాఖలు అవుతున్నందున, మొదటి రోజు నుండే నామినేషన్లు వచ్చేలా చూడాలన్నారు. ఏకగ్రీవాలను ప్రోత్సహించొద్దని, భవిష్యత్తులో సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పై ఉందని, సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించి స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక నామినేషన్లు వచ్చే విధంగా చూడాలన్నారు. స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులు నామినేషన్ ఫారంలో ప్రతి కాలం నింపేవిధంగా, అభ్యర్థి వ్యక్తిగత ధ్రువీకరణ పత్రం అభ్యర్థి సంతకంతో పాటు ప్రతిపాదకుల సంతకం ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్ ద్వారా నివృత్తి చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా పంచాయితీ అధికారి రమేష్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పి సీఈవోగా గోవింద్ చేసిన సేవలు మరువలేనివి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సీఈవో గోవింద్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి జీవితంలో పదవి విరమణ పొందడం సహజమని తెలిపారు. జెడ్పీ సీఈవో గా ఇస్లావత్ గోవింద్ చేసిన సేవలు మరువలేనివి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిత్యం అందుబాటులో ఉంటూ, తన కర్తవ్యాన్ని క్రమశిక్షణతో నిర్వర్తించారని అన్నారు. జిల్లా ఇంచార్జ్ ఉపాధి కల్పన అధికారిగా కూడా ఆయన చేసిన సేవలు మరువలేనివి అన్నారు. ఆ వివిధ శాఖల్లో, వివిధ హోదాల్లో మచ్చలేకుండా తన ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని అన్నారు. నూతనంగా ఉద్యోగంలోకి చేరిన ఉద్యోగులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం జీవితం మొత్తం కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాక్షించారు. ఉద్యోగ విరమణ అనంతరం అవసరైనపుడు ఉద్యోగులకు తన సలహాలు అందివ్వాలని తెలిపారు. పలువురు జిల్లా అధికారులు మాట్లాడుతూ, జెడ్పీ సీఈవో గోవింద్ పదవీ విరమణ చేయడం అన్ని శాఖల ఉద్యోగులందరికీ తీరని లోటు అని అన్నారు. ఉద్యోగ నిర్వహణలో ఎంతో అనుభవం కలిగి ఉండి, ఉద్యోగులందరికీ ఎన్నో విలువైన సలహాలు, సూచనలు అందించారని వివరించారు. అనంతరం జెడ్పీ సీఈవో గోవింద్ మాట్లాడుతూ, తన ఉద్యోగ జీవితంలోని అనుభవాలను పంచుకున్నారు. సర్వీసులో సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు కలెక్టర్, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా తన సూచనలు అధికారులకు అందిస్తానని అన్నారు. ఆ తర్వాత జెడ్పీ సీఈవో గోవింద్ దంపతులను జిల్లా కలెక్టర్, అధికారులు, కుటుంబ సభ్యులు పూల మొక్కలను అందించి, శాలువాలతో సన్మానించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, జెడ్పీ సీఈవో కుటుంబ సభ్యులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. ఎల్లప్పుడు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నూతన డిసిసి అధ్యక్షులు గా ఎన్నికైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం నాయకులు........



నిర్మల్ జిల్లా నవంబర్ 29 అమృత్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు గా ఎన్నికైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బుజ్జి పటేల్ ను శుక్రవారం రోజు ఉట్నూరులోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లాలోని సోన్ మండలంలో గల పాకుపట్ల గ్రామంలో భూమి సమస్య గురించి దళిత సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీటీసీ బోర పుష్ప భర్త బోర శ్రీనివాస్ మరియు వారి కుటుంబ సభ్యులైన బోర గంగాధర్, బోర శ్రీధర్ లను ఇటీవల పాకుపట్ల గ్రామ విడీసీ సభ్యులు అందరూ కలిసి గ్రామ బహిష్కరణ చేశారు. గ్రామ బహిష్కరణకు గురైన దళితులకు గ్రామంలో ఏ వర్గానికి చెందిన వారైనా సరే వీరితో ఎవ్వరు మాట్లాడవద్దని వీరి పొలం పనులకు ఎవ్వరూ పోకూడదని వీరికి ఎవ్వరు హార్వెస్టర్లు మోటార్లు ట్రాక్టర్లు అద్దెకు ఇవ్వవద్దని గ్రామ ఆటోలలో ఎక్కనివ్వొద్దని వీరికి గ్రామంలో ఎవరైన సహకరించిన వీరితో మాట్లాడిన 20వేల జరిమానా విధించబడునని హెచ్చరికలు జారీ చేశారు. ఈ విషయాలను డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కు తెలియజేయడం జరిగింది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెంటనే స్పందించి సోన్ పోలీస్ స్టేషన్ సీఐ తో జరిగిన సంఘటనను ఫోను ద్వారా అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు వెంటనే న్యాయం జరిగేలా చూడాలని తెలియపరిచారు అన్యాయాలకు అవమానాలకు గురైన బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేటట్లు చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది. వారం రోజుల్లో ఈ సమస్య పరిష్కారం అయ్యేటట్లు చూస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోళ్ల వెంకటస్వామి, జిల్లా అధ్యక్షులు బత్తుల రంజిత్, బాధిత కుటుంబ సభ్యులు బోర శ్రీనివాస్, బోర శ్రీధర్, బోర గంగాధర్ లు తదితరులు పాల్గొన్నారు.

# మూలరాంపూర్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కానుగంటి లాస్య -రాజశేఖర్ ఏకగ్రీవం



అభినందిస్తున్న మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ నవంబర్ 29: కోరుట్ల నియోజకవర్గ పరిధిలోని ఇబ్రహీంపట్నం మండలం మూలా రాంపూర్ గ్రామంలో కాసు గంటి లాస్య -రాజశేఖర్ల నామినేషన్ దాఖలు చేశారు.ఈ రోజు నామినేషన్ కు చివరి రోజు కావడతో ఎవరు వేయపోగా కాసుగంటి లాస్య రాజశేఖర్ ల గెలుపు ఏకగ్రీవంగా కనిపిస్తోంది . ఈ సందర్భంగా కాసుగంటి లాస్య రాజశేఖర్ మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డిల సూచన మేరకు గ్రామ సర్పంచిగా నేను నామినేషన్ వేయడం జరిగిందని నా నామినేషన్ కు సహకరించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు .మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి అదే విధంగా నన్ను ఏకగ్రీవంగా నాకు మద్దత్తు తెలిపిన గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# భీమన్న గుట్ట సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి పట్టణంలోని భీమన్న గుట్ట భూముల సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హామీ ఇచ్చారు. శనివారం కలెక్టరేట్లోని తన చాంబర్ లో నిర్మల్ ముదిరాజ్ సంఘ బృందం సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ విషయమై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను రాగానే, ఆ ఆదేశాలను అనుసరించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎవరు ఈ విషయంపై ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని అన్నారు. చేపట్టిన ఆందోళనలు విరమించాలని కోరారు. ఈ సమావేశంలో ముదిరాజ్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటకారి సాయన్న, జిల్లా అధ్యక్షులు గణేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయి, యువజన సంఘ అధ్యక్షులు రాజేష్, ప్రధాన కార్యదర్శి చరణ్, ఉపాధ్యక్షులు అర్జున్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశానుసారం ఆందోళనకారులతో దీక్ష విరమింపజేసిన ఆర్డిఓ.

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు, భీమన్న గుట్ట సమస్య పరిష్కారం కొరకు గత ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్న వారితో ఆర్డీవో రత్నకళ్యాణి, నిమ్మ రసాన్ని అందజేసి దీక్షను విరమింప చేశారు. తమ ఆందోళనలను అర్థం చేసుకొని, సమస్య పరిష్కారం కొరకు చొరవ తీసుకున్నందుకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు, దీక్ష విరమింప చేసిన ఆర్డీవో కు దీక్ష చేపట్టినవారు కృతజ్ఞతలు తెలియజేశారు. దీక్ష విరమింపచేసిన వారిలో ఆర్డిఓ వెంట తహసిల్దార్ రాజు ఉన్నారు.

# తెగిస్తేనే వచ్చింది ఈ తెలంగాణ


**కేసీఆర్ సచ్చుడో – తెలంగాణ వచ్చుడో నినదించిన**

**తెలంగాణ తల్లికి నివాళులర్పించిన మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**


**2001 లో డిగ్రీ విద్యార్థిగా కేసీఆర్ చే జెండా కార్యక్రమం నిర్వహించడం జరిగింది – ఎమ్మెల్యే అనిల్ జాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న



సమావేశంలో హాజరైన బిఆర్ఎస్ కార్యకర్తలు





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ దీక్షా దివాస్ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దీక్ష దివాస్ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న తో కలిసి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన ఫోటో గ్యాలరీని వీక్షించి అనంతరం వారు చేసిన త్యాగాలను మరియు రాష్ట్రం సాధించిన తర్వాత ప్రగతిని నాయకులతో కలిసి వీక్షించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా 2009 నవంబర్ 29 నాడు కేసీఆర్ సచ్చుడో – తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో కేసీఆర్ గారు ఆమరణ నిరాహారదీక్ష చేసి నేటికి 16 ఏండ్లు గడిచాయని అన్నారు. ఆనాడు కేసీఆర్ గారు చేసిన ప్రాణ త్యాగ ప్రయత్నం వల్లనే ఈరోజు తెలంగాణ రాష్ట్రం ఏర్పడి అభివృద్ధి, ప్రగతి సాధించిందన్నారు. టి బీజేపీ, టి కాంగ్రెస్ లకు పదవులు కేసీఆర్ గారు పెట్టిన భిక్ష అని అన్నారు. కేసీఆర్ గారు ఆనాడు ఉద్యమం ప్రారభించకపోయి ఉంటే ఈ కాంగ్రెస్ నాయకులను ఎవరైనా గుర్తుపట్టేవారా అని అన్నారు. 2001 లో కేసీఆర్ ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించినప్పుడు ఆనాడు డిగ్రీ విద్యార్థిగా నెరడిగొండ లో కేసీఆర్ చేతుల మీదుగా జెండా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు.

# పోలీస్ కిష్టయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలి



భువనగిరి :అమృత్ తెలంగాణ: తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన ఆత్మ బలిదానంతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని ముదిరాజ్ మహాసభ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరి పట్టణంలో డిసెంబర్ 1న నిర్వహించే పోలీస్ కిష్టయ్య సంస్కరణ దిన వర్ధంతి వాల్ పోస్టర్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ నాయకులు పెంట నరసింహ, కొలుపుల హరినాథ్, ఇట్టబోయిన గోపాల్ లు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ దీక్ష అరెస్టుతో ఎక్కడ తెలంగాణ రాకుండా పోతుందో అన్న ఆందోళనతో పోలీస్ కిష్టయ్య తన సర్వీస్ తుపాకితో కాల్చుకొని ఆత్మ బలిదానం చేసి ఉవ్వెత్తున ఉద్యమాన్ని ఎగసిపడేలా చేశాడని అన్నారు. ఆయన బలిదానంతో ఉద్యమంలో మరింత ఊపు వచ్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఎంతోమంది ఉద్యోమ బాట పట్టారని అన్నారు. డిసెంబర్ 1న గ్రామాల్లో మండల కేంద్రాల్లో జిల్లా కేంద్రాల్లో అమర స్తూపాల వద్ద పోలీస్ కిష్టయ్య సంస్మరణ దిన వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పోలీస్ కిష్టయ్య విగ్రహాన్ని రాజధానిలోని ట్యాంక్బండ్ పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహాసభ నాయకులు కుక్కదుగు సోమయ్య, సాదు విజయ్, గొర్రెంకల శివశంకర్, ఎనబోయిన జహంగీర్, ఉడుత భాస్కర్, మాటూరి అశోక్, పిట్టల బాలరాజు, దిడ్డికది భగత్, కమ్మ వెంకటేష్,బోయిని బాలయ్య, షాగంటి నర్సింహ, గుర్రాల మల్లేష్, యాట కుమార్, మౌటం రవి, గుర్రాల శివ నాగేందర్, కనక బాలరాజు, పెంటబోయిన నాగరాజు, గుర్రాల శ్రీశైలం పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లా కార్యకర్తల సన్నాహక సమావేశం విజయవంతం చేయండి" డీసీసీ అధ్యక్షులు డా నరేష్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : అదిలాబాద్ జిల్లా పట్టణంలోని TNGO, s సెంట్రల్ గార్డెన్ యందు అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ,నరేష్ జాదవ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో పాటు కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయనైనది, ఇట్టి సమావేశంలో లితెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన దిగ్విజయంగా రెండు సంవత్సరములు పూర్తి చేసుకున్న శుభ తరుణంలో డిసెంబర్ మొదటి వారంలో చేపట్టబోతున్న కార్యక్రమాలతో పాటు మన లిరాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి యొక్క పర్యటన తోపాటు డిసెంబర్ మాసంలో నిర్వహించే స్థానిక సంస్థల (సర్పంచ్) ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థుల గెలుపు విషయంలో అందరి యొక్క అభిప్రాయాలతో సమన్వయం చేస్తూ సమావేశము ఏర్పాటు చేయడమైనది కావున దయచేసి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సమావేశానికి సకాలంలో విచ్చేసి కార్యక్రమాలను జయప్రదం చేయవలసినదిగా విజ్ఞప్తి

# సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించాలి



బొమ్మలరామారం :అమృత్ తెలంగాణ: నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థులను జరగబోయే సర్పంచ్ వార్డు సభ్యులను ఎన్నికల్లో గెలిపించాలని మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం అన్నారు. శనివారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని అనంతరం మాట్లాడుతూ.. ఇప్పటివరకు ప్రజా ప్రతినిధులుగా సీపీఐ(ఎం) ప్రాతినిత్యం వహించిందని అన్నారు. గ్రామాలలో, మండలాలలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా సమగ్రాభివృద్ధి ధ్యేయంగా పనిచేశారని గుర్తు చేశారు. నిరంతరం గ్రామాల్లో ఉన్న రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాల్లో పని చేసే వారిని గెలిపించి గ్రామ అభివృద్ధి ధ్యేయంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముద్దం మధుసూదన్ రెడ్డి, బండ కొమురయ్య, ముద్దం మధుసూదన్ రెడ్డి, బండ కొమురయ్య , దే శెట్టి సత్యనారాయణ, దేవేందర్ రెడ్డి, మంద రాజు, నల్గొండ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లు వాహనాలు నడపరాదు




వనపర్తి :అమృత్ తెలంగాణ: మైనర్లు వాహనాలు నడపరాదు అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి రజని అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా నాగవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ మోటార్ వాహనాల చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు బాల బాలికలు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని తెలియజేశారు. బాల్య వివాహాల నిషేధ చట్టం ప్రకారం మైనర్ల వివాహాలకు సహకరించిన ప్రతి ఒక్కరు కూడా చట్టప్రకారంగా శిక్ష అర్హులు అవుతారని తెలియజేశారు. బాల బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. మరియు విద్యార్థులు వినోదం, సందేశాత్మకమైన, నీతి కథలు వంటి పుస్తకాలను చదవడం వలన సమయస్ఫూర్తి పెరుగుతుందని తెలియజేశారు. మరియు ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. ఉచిత న్యాయ సలహాల కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ కృష్ణయ్య , పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 7 నుంచి 9 వరకు సీఐటీయూ రాష్ట్ర మహాసభలు




వనపర్తి : డిసెంబర్ 7 నుంచి 9 వరకు సీఐటీయూ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని సీఐటీయూ వనపర్తి జిల్లా కార్యదర్శి మండ్ల రాజు అన్నారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) వనపర్తి జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం శనివారం సీఐటీయూ వనపర్తి జిల్లా కార్యాలయంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్ ఎన్ రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ వనపర్తి జిల్లా కార్యదర్శి మండ్ల రాజు, సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఐదవ మహాసభలు డిసెంబర్ 7 నుంచి 9 వరకు మెదక్ జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలో గత పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవడం జరుగుతుందని అనంతరం ఈ మహాసభలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు సీఐటీయూ నిబంధనలు ప్రకారం మూడు సంవత్సరాలకు ఒకసారి ఈ మహాసభలు నిర్వహించడం జరుగుతుంది కేంద్రంలో ఉండేటువంటి నరేంద్ర మోడీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా విభజించి కార్మిక హక్కులను కాల రాయడం జరుగుతుందని అన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్స్ వల్ల పారిశ్రామికవేతలకు కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడుతుందని వారు అన్నారు. ఎనిమిది గంటల పని దినం ఇప్పుడు 12 గంటలు చేయాలని సమ్మె చేసే హక్కు లేకుండా వేతనాలు పెంచాలని అడగకుండా సంఘాలను పెట్టుకోకుండా ఈ నాలుగు లేబర్ కోడులు తీసుకువచ్చారని ఈ నాలుగు లేబర్ కోడులకు వ్యతిరేకంగా ప్రధానంగా ఈ మహాసభలో చర్చించబోతున్నామని రాబోయే కాలంలో కార్మిక సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు చేయడం కోసం ఈ మహాసభలు వేదిక కాబోతున్నాయని వారు అన్నారు. ఏడో తారీఖు రోజు మెదక్ పట్టణంలో వేలాదిమంది కార్మికులతో ప్రదర్శన బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈ బహిరంగ సభకు సీఐటీయూ అఖిలభారత అధ్యక్షులు డాక్టర్ హేమలత, అఖిలభారత ప్రధాన కార్యదర్శి తపన్ సేను, అఖిలభారత కోశాధికారి సాయిబాబు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చుక్కా రాములు, పాలడుగు భాస్కర్, పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభలను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పుట్ట ఆంజనేయులు, జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్, జిల్లా ఉపాధ్యక్షులు కే సునీత, జిల్లా సహాయ కార్యదర్శి గంధం మదన్, సూర్యవంశం రాము, ఏ బుచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ వేణి హైస్కూల్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం




శిబిరంలో పాఠశాల ప్రిన్సిపల్ సతీష్ కుమార్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జన్నారం :అమృత్ తెలంగాణ: మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి హైస్కూల్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత రక్తదాన శిబిరంలో భాగంగా ఆక్సిస్ బ్యాంకు ఫ్రీఛార్జ్ బ్యాంకు మేనేజర్ సురేష్ బ్యాంకు సిబందితో కలసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రతహీనత ఉన్నవారికి వ్యాధిగ్రస్తులకు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ఉన్నవారికి ఈ రక్తాన్ని అందించాలని కోరారు. ఈ రక్తదాన

# స్థానిక సర్పంచ్ కు మొగ్గు చూపుతున్న ప్రజలు

చారకొండ :అమృత్ తెలంగాణ: స్థానిక' సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తమైంది. చారకొండ మండలంలో మూడవ విడత డిసెంబర్ 17న 17 పంచాయితీలు,142 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.దీంతో ఆశావహుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొన్నది. 'పంచాయతీ' బరిలోకి దిగేందుకు యువత ఆసక్తి చూపుతున్నది. పోటీ కోసం యువ నాయకత్వం రంగం సిద్ధం చేసుకుంటున్నది. ఒకవైపు, ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి యువ నాయకులు చొరవ చూపుతున్నారు. మరోవైపు గ్రామలలోని ముఖ్య నాయకులు పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా బరిలో దిగేందుకు యత్నిస్తున్నారు. చారకొండ మండలంలో రిజర్వేషన్లు అనుకూలించిన వారు సర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ఆశావహులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

స్థానికంగా ఉన్న వ్యక్తే సర్పంచ్

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామ సర్పంచ్ కీలకం. అలాంటి సర్పంచ్ నిత్యం ప్రజలకు,పాలన అందుబాటులో ఉండాలి. అలాంటి సర్పంచ్ స్థానికేతరులు కాకుండా స్థానికంగా ఉన్న వ్యక్తిని పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా ఎన్నుకోవాలని ప్రజలు,యువత మొగ్గు చూపుతున్నారు.

ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నం..

ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ నాయకులు, ఆశవాహులు నిత్యం జనంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. ప్రజల్లో గుర్తింపు పొందేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు, పల్లెల్లోని సీనియర్ నాయకులు, మాజీ సర్పంచులు, ఓటర్లను ప్రభావితం చేసే నేతలను కలుస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బరిలో ఉండాలనుకునే నాయకులు ప్రజల మద్దతు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు

యువత ఉత్సాహం..

రాజకీయాలంటే పెద్దగా ఆసక్తి చూపని యువత ధోరణిలో ప్రస్తుతం మార్పు కనిపిస్తున్నది. రాజకీయాల్లోకి రావడానికి మక్కువ చూపుతున్నది. అందుకు పంచాయతీ




ఎన్నికలను అవకాశంగా మలుచుకోవాలని ఎంతో మంది యువకులు భావిస్తున్నారు.పోటీకి ఆసక్తి చూపుతున్న యువకులు ఇప్పటికే కదనరంగంలోకి దూకేశారు. అటు రాజకీయ హోదాను అనుభవించేందుకు, అదే సమయంలో ఇటు ప్రజా సేవ చేయొచ్చన్న ఆలోచనతో చాలా మంది యువ నేతలు పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. ఊరిలో అధికారం చెలాయించవచ్చనే భావనతో ఎంతో మంది సర్పంచ్ పీఠంపై కన్నేశారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో యువకులదే హవా స్పష్టంగా కనిపించే అవకాశముంది.

చారగొండ గ్రామం పట్ల పూర్తి అవగాహన ఉండి, అందరికీ అందుబాటులో ఉన్న వ్యక్తి, ముఖ్యంగా స్థానికంగా ఊరిలో ఉన్న వ్యక్తినే సర్పంచ్ ఎన్నుకోవాలి. మన గ్రామంలోని ప్రజా సమస్యల పైన, అవినీతి అక్రమాల పైన కొట్లాడుతూ, మన గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పని చేసే వారినే సర్పంచ్ గా ఎన్నుకుందాం.. కన్నా మోగిళ్ళ , చారకొండ.

# విద్యార్థికి యంగ్ సైంటిస్ట్ అవార్డు




బల్మూరు :అమృత్ తెలంగాణ: మండల కేంద్రం లోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో చదువుతున్న గగన్ చంద్ర అనే విద్యార్థికి యంగ్ సైంటిస్ట్ అవార్డు కు ఎంపికయ్యాడు. జాతీయ సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలో గత నెలలో భోపాల్ లో నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలో త్రీ ఇన్ వన్ సైకిల్ రూపొందించగా ఇందుకుగాను సైన్స్ ఫెయిర్ లో జాతీయస్థాయి అవార్డు వచ్చిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ రెడ్డి తెలిపారు. త్రీ ఇన్ వన్ సైకిల్ ప్రత్యేకత విద్యుత్ చార్జీ బ్యాటరీతో మరియు సోలార్ ఎనర్జీతో మరియు సైకిళ్ల తొక్కుతూ కూడా నడపడం ఈ యొక్క సైకిల్ ప్రత్యేకత అని తెలిపారు. జాతీయస్థాయిలో ఎంపికైనందుకుగాను శనివారం మండల కేంద్రంలో అభినందన ర్యాలీ ఊరేగింపుగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం

పాఠశాలలో ఏర్పాటుచేసిన విద్యార్థుల సమావేశంలో పలువురు గ్రామస్తులు విద్యావంతులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేందర్ గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆవును చంపిన పులి.. యజమానికి నష్ట పరిహారం అందజేత




జన్నారం :అమృత్ తెలంగాణ: జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని ఇందన్ పల్లి నార్త్ బీట్లో ఈనెల 26న పులి ఒక ఆవును చంపింది. స్పందించిన అటవీ అధికారులు ఆ ఆవు యజమాని కుచారి శ్రావణ్ రావు రూ.25వేల నష్టపరిహారం ప్రొసీడింగ్ కాపీని జన్నారం ఎఫ్డిఓ రామ్మోహన్ ఆదేశాల మేరకు ఇందన్ పల్లి రేంజ్ కార్యాలయంలో ఎఫ్ ఆర్ ఓ లక్ష్మీనారాయణ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమీపంలోని గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకరు ,ఇద్దరు తిరుగవద్దని, పశువుల కాపరులు అడవిలోకి వెళ్లవద్దని, ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని తెలిపారు. వేట కోసం కరెంటు వైర్లు, ఉచ్చులు, ఉర్లు పెట్టితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ ప్రాంతంలో ఎవరికైనా పులి కనిపిస్తే ఆ సమాచారాన్ని అటవీ అధికారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ లు రవి ,హన్మంతరావు, ఎఫ్బిఓ లు శ్రీనివాస్, తన్వీర్ పాషా బేస్ కాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమించండి..

బజార్ హత్నూర్ : మహిళల మీద జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ప్రజలు, మహిళా సంఘాలు పోరాడాలని సఖి కేంద్రం నిర్వాహకురాలు లావణ్య అన్నారు. శనివారం మండలంలోని పిప్రీ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్వాడీ కార్యకర్తలకు అంతర్జాతీయ మహిళలపై హింసకు వ్యతిరేకంగా ప్రచారోద్యమంలో భాగంగా సఖి కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు బాలికలపై హింసను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు ముందుండాలని, ఆత్మన్యూనత భావాలకు, ఎలాంటి ప్రలోభాలకు లోనూ కాకూడదని సూచించారు. మహిళల, బాలికల సంబంధించిన చట్టాలు గృహ హింస, పోక్సో, బాల్యవివాహాల నిరోధక చట్టం, పని స్థలంలో వేధింపులు ఆర్థిక హింసల పై, సోషల్ మీడియా, చాట్ యాప్స్, తప్పుడు ఫోటోలు సృష్టించడం వ్యక్తిగత సమాచారాన్ని బయట పెట్టడం లాంటి వేధింపులు జరిగినట్లయితే ధైర్యంగా చర్యలు తీసుకోవడానికి ముందుండాలని తెలిపారు.

లైంగికంగా హింసించబడటం గాని, అత్యాచారానికి గురికావడం గాని,అక్రమ రవాణా కాబడటం గాని, బలవంతంగా పెళ్లి చేయడంగానీ, సైబర్ హింస గాని,




బాల్యవివాహాలు చేయడంవల్ల గాని, పని ప్రదేశాలలో లైంగిక వేధింపులవల్ల గాని, అసభ్య పదజాలంతో దూషించడంవల్ల గాని, ఇలా అనేకరకాలుగా మహిళలు హింసకు గురవుతున్నారన్నారు. సఖీ కేంద్రం అందించే ఐదు రకాల సేవలు, హెల్ప్ లైన్ నంబర్స్ 181,1098, 1930, 100 గురించి వివరించారు. ఈ కార్యక్రమం నందు ఐసిడిఎస్ సూపర్ వైసర్ / టీచర్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అందాల రాశి ఇన్ని ఆఫర్లు వద్దనుకుందా..?



ఢిల్లీ భామ రాశి ఖన్నా కెరీర్ మొదలు పెట్టింది హిందీ సినిమాలతోనే అయినా ఆమెని ఆదరించింది మాత్రం సౌత్ ఆడియన్స్ అని చెప్పొచ్చు. ముఖ్యంగా తెలుగు ఆడియన్స్ ఆమెను హీరోయిన్ గా గుర్తింపు ఇచ్చారు. మనం సినిమాలో ఏదో ఒక చిన్న పాత్ర చేసిన ఆమెను అవసరాల శ్రీనివాస్ ఊహలు గుసగుసలాడే సినిమాలో హీరోయిన్ గా చేశాడు. అంతకుముందే మద్రాస్ కేఫ్ సినిమాలో నటించింది రాశి ఖన్నా. కెరీర్ లో ఏ సినిమా సక్సెస్ అవుతుందో ఏ సినిమా ఫెయిల్ అవుతుందో చెప్పడం కష్టం.అయితే ముందు జడ్జ్ చేసి కొన్ని సినిమాల్లో తన పాత్ర నచ్చక చేయనని చెప్పేసిందట రాశి ఖన్నా. విచిత్రం ఏంటంటే అందులో చాలా సినిమాలు హిట్ అయినవి ఉండటమే.. రాశి ఖన్నా వదిలేసిన సినిమాలు కొన్ని హిట్ గా నిలిచాయి. అందులో మారుతి డైరెక్షన్ లో వచ్చిన మహానుభావుడు. శర్వానంద్ హీరోగా చేసిన ఈ సినిమాలో రాశి ఖన్నా పాత్ర నచ్చక సినిమా చేయనందట ఆ ఛాన్స్ మెహ్రీన్ కి వెళ్లింది. ఆమె ఖాతాలో ఒక మంచి హిట్ నిలిచింది. ఇదే కాదు .2 సినిమాలో హనీ పాత్రకి కూడా ముందు రాశి ఖన్నానే అనుకున్నాడట డైరెక్టర్ అనీల్ రావిపుడి. కానీ రాశికి ఆ క్యారెక్టర్ కూడా నచ్చలేదట. అలా అమ్మడు ఆ ఛాన్స్ కూడా వదులుకుంది. రాశి ఖన్నా మిస్ చేసుకున్న సూపర్ హిట్ సినిమాల్లో ఒకటి గీతా గోవిందం. విజయ్ దేవరకొండ రష్మిక జంటగా నటించిన ఆ సినిమా 100 కోట్లని కలెక్ట్ చేసింది. ఆ సినిమాలో రష్మికకు ముందు రాశికి ఆఫర్ వచ్చిందట. కానీ ఆమె వేరే సినిమాలతో బిజీగా ఉండటం వల్ల గీతా గోవిందం మిస్ చేసుకుందట. అలా రష్మికకు ఓ సూపర్ హిట్ దొరికేసింది. బెల్లంకొండ శ్రీనివాస్ రాక్షసుడు సినిమాలో కూడా అనుపమకు ముందు ఆఫర్ రాశికే రాగా ఆమె ఏవో కారణాల వల్ల కాదన్నదని తెలుస్తుంది. మజిలీ సినిమాలో దివ్యాన్ష కౌశిక్ నటించిన పాత్రకు రాశి ఖన్నాని అడిగారట. కానీ ఆ పాత్ర రాశి ఖన్నా చేయనని చెప్పిందట. తమిళంలో శింబు హీరోగా చేసిన మానాడులో హీరోయిన్ గా కూడా ఆమె ఛాన్స్ మిస్ చేసుకుంది.

# అందరూ నా పనైపోయిందనుకున్నారు: సేతుపతి


విజయ్ సేతుపతి హీరోగా నటించిన సినిమాలు మాత్రం ఫ్లాపులుగా నిలవడంతో అందరూ హీరోగా ఇక సేతుపతి పనైపోయిందనుకున్నారు. ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న విజయ్ సేతుపతి మహారాజా సినిమాకు ముందు హీరోగా చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొడుతూనే వచ్చాయి. విడుదల1, విడుదల2కు పేరైతే వచ్చింది కానీ కమర్షియల్ గా మాత్రం ఆ రెండు సినిమాలు పెద్దగా సక్సెస్ అవలేదు. కానీ సేతుపతి విలన్ గా చేసిన సినిమాలు మాత్రం మంచి ఆదరణ పొందాయి. విజయ్ సేతుపతి హీరోగా నటించిన సినిమాలు మాత్రం ఫ్లాపులుగా నిలవడంతో అందరూ హీరోగా ఇక సేతుపతి పనైపోయిందనుకున్నారు. అలాంటి టైమ్ లో సేతుపతి కెరీర్ లో 50వ సినిమాగా వచ్చిన మహారాజా సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. సేతుపతి కెరీర్ లోనే మహారాజా మైల్ స్టోన్ మూవీ అయిపోయింది. కెరీర్ ముగిసిందనే టైమ్ కు మహారాజా సినిమా తనను మళ్లీ నిలబెట్టిందని రీసెంట్ గా సేతుపతి ఓ వేడుకలో తెలిపారు. స్టార్ బోల్డ్ ట్రీట్ ఓ అవార్డు ఫంక్షన్ లో మహా



రాజా మూవీకి బెస్ట్ యాక్టర్ అవార్డు రాగా, అవార్డు తీసుకున్న తర్వాత సేతుపతి ఈ మూవీ గురించి మాట్లాడి తన సంతోషాన్ని పంచుకున్నారు. 2-3 ఏళ్లుగా తన నుంచి వచ్చిన సినిమాలేవీ బాగా ఆడలేదని, సరైన టైమ్ లో వచ్చిన మహారాజా తనను నిజంగానే మహారాజాను చేసిందని, ఈ మూవీకి ఇన్ని ప్రశంసలొస్తాయని ఊహించలేదని, చైనాలో ఎక్కువ కలెక్షన్స్ సాధించిన చిత్రంగా మహారాజా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమాలో ఎలాంటి సాంగ్స్, అనవసరమైన ఫైట్స్ లేకుండా కేవలం కథతోనే మహారాజా సినిమాను నడిపించాడు డైరెక్టర్ నిథిలన్. కథతో పాటూ సేతుపతి తన నటన, స్క్రీన్ ప్రెజెన్స్ తో సినిమాను నెక్ట్స్ లెవెల్ కు తీసుకెళ్లాడు. తమిళంలోనే కాకుండా తెలుగులో కూడా మహారాజా సినిమాకు మంచి కలెక్షన్లు వచ్చాయి. ఇదిలా ఉంటే విజయ్ సేతుపతి మహారాజా తర్వాత కథల ఎంపికలో చాలా జాగ్రత్తగా ఉంటున్నారు. వచ్చిన కథలన్నీ ఒప్పుకోకుండా, బాగా నచ్చిన కథల్ని మాత్రమే సెలెక్ట్ చేసుకుంటున్నారు. కథ బాగుండి తన పాత్రకు ప్రాధాన్యత ఉన్న సినిమాల్నే ఎంచుకుని వాటిని మాత్రమే చేయాలని సేతుపతి నిర్ణయించుకున్నారట. ఇక మీదట రెగ్యులర్ గా ఉండే విలన్ పాత్రలకు కూడా సేతుపతి నో చెప్తాడని అంటున్నారు.

# శ్రీలీల మళ్లీ పుంజుకుంటుందిగా..!

కెరీర్ లో ఎంత తక్కువ టైం లో స్టార్ క్రేజ్ వచ్చిందో అంతే త్వరగా డౌన్ ఫాల్ అయ్యింది శ్రీలీల. కొద్దిపాటి గ్యాప్ తో మళ్లీ శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటుంది. పెళ్లిసందడి సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన శ్రీలీల మాస్ మహారాజ్ రవితేజ ధమాకాతో సూపర్ హిట్ అందుకుంది. ఆ సినిమా తర్వాత అమ్మడు వరుస సినిమా ఛాన్స్ లు అందుకుంది. ఐతే చేయడానికి అరడజను సినిమాల దాకా చేసినా అందులో భగవంత్ కేసరి, గుంటూరు కారం తప్ప మిగతా సినిమాలన్నీ కూడా డిజప్పాయింట్ చేశాయి. కెరీర్ లో ఎంత తక్కువ టైం లో స్టార్ క్రేజ్ వచ్చిందో అంతే త్వరగా డౌన్ ఫాల్ అయ్యింది శ్రీలీల. కొద్దిపాటి గ్యాప్ తో మళ్లీ శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటుంది. స్టార్ బోల్డ్ ట్రీట్ ప్రస్తుతం రవితేజతో మాస్ జాతర సినిమా



చేస్తున్న శ్రీలీల నితిన్ రాబిన్ హుడ్ తో ఈ మంత్ ఎండ్ రాబోతుంది. ఈ సినిమాలతో పాటుగా అమ్మడు లేటెస్ట్ గా మరో లక్కీ ఛాన్స్ కొట్టేసిందని తెలుస్తుంది. ఇప్పటికే తెలుగుతో పాటు హిందీలో కార్తీక్ ఆర్యన్ తో ఒక సినిమా చేస్తుంది అమ్మడు. కోలీవుడ్ లో కూడా శివ కార్తికేయన్ తో పరాశక్తి సినిమాలో అవకాశం దక్కించుకుంది. వీటితో పాటు మళ్లీ తెలుగు స్టార్ ఛాన్స్ లు వరుస కడుతున్నాయి. ఈ సినిమాలతో మళ్లీ శ్రీలీల పుంజుకుంటుందని చెప్పొచ్చు. శ్రీలీల డ్యాన్స్ సినిమాలకు అడ్వాంటేజ్ అవుతుంది. ఆమె ఉంటే మ్యూజిక్ అదిరిపోతుంది.




# ఇస్మార్ట్ బ్యూటీ.. ఇచ్చి పడేస్తుంది..!



గ్లామర్ ఫీల్డ్ లో గెలవాలంటే వారికి తోచినట్టు కాదు ప్రేక్షకులకు నచ్చినట్టు ఉండాల్సి ఉంటుంది. ఎప్పుడూ కేవలం నటనతోనే ఆదరిస్తానంటే ఒప్పుకోరు హీరోయిన్ అన్నాక గ్లామర్ యాంగిల్ కూడా చూపించాల్సిందే. ఇప్పుడొస్తున్న భామల్లో అలా ఫిక్స్ అయి వచ్చే వారే ఎక్కువమంది ఉన్నారు. వారిలో ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ ఒకరు. సుధీర్ బాబు సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన నభా మొదటి సినిమాతోనే తనలో నటిని పరిచయం చేసి మెప్పించింది. ఇక పూరీ చేతిలో పడ్డాక అమ్మడి ఫేట్ మారిపోయింది. ఇస్మార్ట్ శంకర్ సినిమాలో ఊర మాస్ పాత్రలో నభా నటేష్ అదరగొట్టేసింది. ఆ సినిమాతో నభాకి రావాల్సిన క్రేజ్ వచ్చేసింది. అయితే అలా వచ్చిన ఆ పాపులారిటీని అమ్మడు సరిగా వాడుకోలేకపోయింది. యువ హీరోలతో సినిమాలైతే చేస్తుంది కానీ కథల సెలక్షన్స్ కుదరక అమ్మడు కెరీర్ లో డీలా పడ్డది. నితిన్ మాస్ట్రో తర్వాత చేతిలో సినిమాలేవి లేకపోయినా సోషల్ మీడియాలో రకరకాల ఫోటో షూట్స్ తో మెప్పిస్తుంది నభా నటేష్. క్రిస్ మస్ సందర్భంగా నభా నటేష్ మరోసారి తన లేటెస్ట్ ఫోటో షూట్ తో రెచ్చిపోయింది. తొడల అందాలు కనిపించేలా అమ్మడు చేస్తున్న ఈ గ్లామర్ షో సోషల్ మీడియాలో అమ్మడి మైలేజ్ కి మంచి హైప్ ఇస్తున్నాయని చెప్పొచ్చు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com